

PRGI : TGTEL/26/A0689

శ్రీకర ఉదయం

తెలుగు దినపత్రిక

నిజమే మా నినాదం...

సంపుటి : 01 సంచిక : 288 హైదరాబాద్ బుధవారం 18 నవంబర్ 2026 ఎడిటర్ : ముశం హరి పేజీలు : 04 వెల : 01/-

క్వాడ్ సదస్సులో పాల్గొన్న ప్రధాని మోదీ

- అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా నేతలతో సమావేశం

మనీలాలో, నవంబర్ 17 (శ్రీకర ఉదయం):



మనీలాలో జరిగిన ఏడో క్వాడ్ నేతల శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జపాన్ ప్రధాని సనాయే తకాయిచి, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి సమావేశానికి హాజరయ్యారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అంశాలపై నేతలు చర్చించారు. క్వాడ్ భాగస్వామ్యాన్ని నిర్మాణాత్మకంగా, విశ్వసనీయంగా ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. ప్రాంతీయంగా శాంతి, సౌభాగ్యం, స్థిరత్వాన్ని పెంపొందించడంలో నాలుగు దేశాల సహకారం కీలకమని పేర్కొన్నారు. పరస్పర విశ్వాసంతో ఉమ్మడి లక్ష్యాల సాధనకు కృషి చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. సముద్ర భద్రత, ఆర్థిక భద్రత, కీలక సాంకేతిక పరిజ్ఞానాలు, విపత్తుల సమయంలో స్పందన వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై సమావేశంలో దృష్టి సారించారు. ఇండో-పసిఫిక్ ప్రాంత దేశాలకు ప్రయోజనం చేకూర్చేలా ఈ రంగాల్లో సమన్వయంతో ముందుకు సాగాలని మోదీ ఆకాంక్షించారు. ప్రాంతీయ సవాళ్లను ఎదుర్కోవడంలో ఉమ్మడి కార్యాచరణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ సందర్భంగా 2027లో ముంబైలో తొలి క్వాడ్ వ్యాపార నేతల వేదికను నిర్వహించనున్నట్లు ప్రధాని ప్రకటించారు. నాలుగు దేశాల వ్యాపార రంగ ప్రముఖులు ఒకచోట చేరి పరస్పర సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఈ వేదిక అవకాశం కల్పించనుంది. ఆర్థిక సహకారాన్ని మరింత విస్తరించడంలో వ్యాపార రంగ భాగస్వామ్యం కీలకంగా నిలవనుంది. క్వాడ్ భవిష్యత్తు పాత్రపై మోదీ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అభివృద్ధి ప్రయాణంలో భాగస్వామిగా, సంక్షోభ సమయాల్లో మిత్రుడిగా, భవిష్యత్తుపై విశ్వాసాన్ని కలిగించే వేదికగా క్వాడ్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుతూ శాంతి, అభివృద్ధి దిశగా నాలుగు దేశాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

సమ్మక్క సాగర్ బ్యారేజీకి నిరభ్యంతర పత్రం ఇవ్వండి: సీఎం రేవంత్ రెడ్డి

- ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయికి విజ్ఞప్తి

- రాయ్‌పూర్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సమావేశం లో

రాయ్‌పూర్, నవంబర్ 17 (శ్రీకర ఉదయం):



ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బహుళ ప్రయోజనాల బ్యారేజీకి వెంటనే నిరభ్యంతర పత్రం జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి రాయ్‌పూర్‌లో ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క సాగర్ ప్రాజెక్టు వివరాలను వెల్లడించి, బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై విష్ణుదేవ్ సాయి సానుకూలంగా స్పందించి, నిరభ్యంతర పత్రం జారీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశముందని రేవంత్‌రెడ్డి వివరించారు. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు సమ్మక్క సాగర్ బ్యారేజీ కీలకమని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతుల విషయంలోనూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సహకరించాలని కోరారు. బ్యారేజీ నిర్మాణం పూర్తయినందున ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. తొలుత ఈ ప్రాజెక్టును కాంతనపల్లి వద్ద నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే ఆ ప్రాంతంలో 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో పాటు 17 ఆదివాసీ గ్రామాలు ప్రభావితమయ్యే పరిస్థితి ఏర్పడింది. భద్రత, మౌలిక సదుపాయాలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని గుర్తించారు. దీంతో ముంపు సమస్యను తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతాయని ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనంలో తేలినట్లు తెలిపారు. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం వంద ఎకరాలకు మించదని పేర్కొన్నారు. ప్రాజెక్టు అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లోనే రూ.9.883 కోట్లను చెల్లించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ తన అధ్యయన నివేదికను జూలై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్లుగా నిర్ణయించగా, నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలుగా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గోదావరి జలాలను వినియోగించుకుని రాష్ట్రంలోని కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల అవసరాలు తీర్చడమే సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని ముఖ్యమంత్రి తెలిపారు. బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని వెంటనే జారీ చేయాలని మరోసారి కోరారు. ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతుల మంజూరులోనూ సహకరించాలని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. నిరభ్యంతర పత్రం ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని విష్ణుదేవ్ సాయి హామీ ఇచ్చినట్లు తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది.

జానీ వాకర్, డ్యూవర్స్ పేరుతో చీప్ లిక్కర్ దందా

- శంషాబాద్‌లో కల్తీ మద్యం విక్రయాలు వెలుగులోకి

- ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ డీటీఎఫ్ బృందం

- ప్రీమియం బ్రాండ్ల పేరుతో తక్కువ ధర మద్యం విక్రయం

- నింపిన బాటిళ్లు, ఖాళీ సీసాలు స్వాధీనం

శంషాబాద్, నవంబర్ 17 (శ్రీకర ఉదయం):



హైదరాబాద్ శివారులోని శంషాబాద్‌లో ప్రీమియం బ్రాండ్ల పేరుతో చీప్ లిక్కర్ విక్రయిస్తున్న అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. జానీ వాకర్, డ్యూవర్స్, 100 పైపర్స్ వంటి ఖరీదైన మద్యం బ్రాండ్ల ఖాళీ బాటిళ్లలో తక్కువ ధర మద్యాన్ని నింపి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో వంగలి అశోక్ (43), మహమ్మద్ యాకూబ్ పాషా (29)లను డీటీఎఫ్ బృందం అరెస్టు చేసింది. అధికారుల వివరాల ప్రకారం.. వంగలి అశోక్ గతంలో డిస్టిలరీలో పనిచేశాడు. మహమ్మద్ యాకూబ్ పాషా స్క్రాప్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వీరిద్దరూ కలిసి ఖాళీ మద్యం బాటిళ్లను సేకరించి వాటిలో చీప్ లిక్కర్ నింపి ప్రీమియం బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందడంతో డీటీఎఫ్ అధికారులు దాడులు నిర్వహించారు. అశోక్ నివాసంపై దాడి చేసిన అధికారులు పది నింపిన మద్యం బాటిళ్లతో పాటు 30కి పైగా ఖాళీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. జానీ వాకర్, డ్యూవర్స్, 100 పైపర్స్ బ్రాండ్లకు సంబంధించిన ఖాళీ సీసాలను వినియోగించి కల్తీ మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బాటిళ్లను తదుపరి విచారణ కోసం అధికారులు పరిశీలనలోకి తీసుకున్నారు.ఎ రూ.560 విలువ చేసే డౌన్‌టౌన్ మద్యాన్ని ఖరీదైన బ్రాండ్ల బాటిళ్లలో నింపి స్థానికంగా సుమారు పది మందికి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తక్కువ ధర మద్యాన్ని ప్రీమియం బ్రాండ్ల పేరుతో విక్రయించి వినియోగదారులను మోసం చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో మద్యం కొనుగోలు చేసిన వారిని గుర్తించేందుకు ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టారు. సీఐ నరేందర్ నేతృత్వంలోని డీటీఎఫ్ బృందం ఈ అక్రమ దందాను గుర్తించి నిందితులను అరెస్టు చేసింది. దాడిలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు విక్రయాల వెనుక ఉన్న ఇతర వివరాలను సేకరిస్తున్నారు. ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన బృందాన్ని గ్రేటర్ హైదరాబాద్ ఎక్సైజ్ అధికారులు అభినందించారు.

గుజరాత్ పారిశ్రామికవేత్తలకు తెలంగాణలో పెట్టుబడుల ఆహ్వానం

అహ్మదాబాద్, నవంబర్ 17 (శ్రీకర ఉదయం):

గుజరాత్ రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలను తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. అహ్మదాబాద్‌లో నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గుజరాత్‌కు చెందిన సుమారు 400 మంది పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, పరిశ్రమల రంగ ప్రముఖులు హాజరయ్యారు. రోడ్‌షో సందర్భంగా పలువురు వ్యాపార ప్రముఖులతో మంత్రి సమావేశమై తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. హైదరాబాద్ సాంకేతిక, వ్యాపార రంగాల్లో సాధించిన ప్రాధాన్యతను ప్రస్తావించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పరిశ్రమలకు అనుకూలమైన విధానాల గురించి వివరించారు. తెలంగాణలో వివిధ రంగాల్లో వ్యాపార విస్తరణకు ఉన్న అవకాశాలను పారిశ్రామికవేత్తల దృష్టికి తీసుకెళ్లారు. గుజరాత్ నుంచి మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి రావాలని, ఇప్పటికే వ్యాపారాలు నిర్వహిస్తున్న సంస్థలు తమ కార్యకలాపాలను విస్తరించాలని కోరారు. పెట్టుబడులకు సంబంధించి రాష్ట్రంలో ఉన్న అనుకూల పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో పాల్గొనాలని గుజరాత్ పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను మరింత విస్తృతంగా తెలుసుకోవాలని, తమ వ్యాపార ప్రణాళికలకు అనుగుణంగా తెలంగాణలో పెట్టుబడులపై పరిశీలన చేయాలని పిలుపునిచ్చారు. గుజరాత్ పారిశ్రామిక రంగంతో తెలంగాణ సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ రోడ్‌షో నిర్వహించినట్లు శ్రీధర్ బాబు వెల్లడించారు. గుజరాత్‌కు చెందిన మరిన్ని వ్యాపార సంస్థలకు తెలంగాణలో స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్నట్లు ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి కుంటుపడింది: కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 17 (శ్రీకర ఉదయం):



కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనలో తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ఆరోపణలు చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. ఎన్నికల సమయంలో అభయహస్తం పేరుతో భరోసా కల్పించి, అధికారంలోకి వచ్చాక ప్రజలకు రిక్తహస్తం చూపించిందని వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల ప్రజలకు రంగుల కలలు చూపించి మోసం చేశారని ఆరోపించారు. సోనియా గాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడంపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, ఉద్యమం వంటి అంశాలకు ఆత్మకథలో చోటు ఎందుకు కల్పించలేదని నిలదీశారు. తెలంగాణ పట్ల సోనియా గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి నిజమైన ప్రేమ లేదనే విషయం దీనితో స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం ప్రజలు చేసిన పోరాటాన్ని గుర్తించకుండా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమానికి సంబంధించిన అంశాలను విస్మరించడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచినట్లేనని అన్నారు. గాంధీ కుటుంబాన్ని ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. గాంధీలకు బాడీగార్డులా ముఖ్యమంత్రి ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం పోరాడిన గడ్డపై పాలకులు గులాములా వ్యవహరించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, రాష్ట్ర గౌరవానికి భంగం కలిగించేలా కాంగ్రెస్ నాయకత్వం వ్యవహరిస్తోందని అన్నారు. తెలంగాణ అభివృద్ధి దిశగా ముందుకు సాగాల్సిన సమయంలో పాలనలో ఆశించిన పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో పెట్టుబడుల పరిస్థితిపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడేళ్లలో ఎన్ని పెట్టుబడులు వచ్చాయి, వాటి ద్వారా ఎన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యాయి, ఎంతమందికి ఉపాధి లభించిందనే వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. తెలంగాణ రైజింగ్ అని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం అభివృద్ధి చెందడం లేదని, తెలంగాణ రైజింగ్ కాదు.. తెలంగాణ ఫాలింగ్ అని విమర్శించారు. పెట్టుబడులపై ప్రకటనలకు పరిమితం కాకుండా వాస్తవ గణాంకాలను వెల్లడించాలని సూచించారు.భారత్ సమ్మిట్ నిర్వహణ వల్ల తెలంగాణ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే వేదికగా కాకుండా రాజకీయ సమ్మిట్‌గా మారిందని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తీసుకొచ్చే కార్యక్రమాలు చేపట్టాల్సిన ప్రభుత్వం ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో సాధించిన అభివృద్ధి, పెట్టుబడుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని, ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వెండి పూత పేరుతో స్వీట్లపై అల్యూమినియం కోటింగ్

- కల్తీ వెండి పూతపై సీపీ మహేష్ భగవత్ ఆందోళన

- చార్మినార్ కేంద్రంగా కోటింగ్ తయారీ జరుగుతోందని వెల్లడి

- ప్రముఖ స్వీట్ దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తింపు

- కిడ్నీ, కాలేయ సమస్యలు వచ్చే ప్రమాదమని హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 17 (శ్రీకర ఉదయం):



స్వీట్లపై వెండి పూత పేరుతో ప్రమాదకరమైన అల్యూమినియం కోటింగ్ వినియోగిస్తున్నారని సీపీ మహేష్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. వెండితో తయారైన పూతగా భావించి ప్రజలు కొనుగోలు చేస్తున్న స్వీట్లలో అల్యూమినియం వాడకం జరుగుతోందని హెచ్చరించారు. ఈ తరహా కల్తీపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్‌లోని చార్మినార్ కేంద్రంగా అల్యూమినియం కోటింగ్ తయారీ జరుగుతోందని మహేష్ భగవత్ వెల్లడించారు. అక్కడ తయారవుతున్న పూతను ప్రముఖ స్వీట్ దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. స్వీట్లపై ఆకర్షణీయంగా కనిపించే వెండి రంగు పూత వెనుక అల్యూమినియం వినియోగం ఉండటంపై ఆయన ఆందోళన వెలిబుచ్చారు. ఈ కోటింగ్ తయారీకి ఉపయోగించే అల్యూమినియం ముడిసరుకు ఉత్తరప్రదేశ్ నుంచి వస్తోందని పేర్కొన్నారు. ముడిసరుకు సరఫరా నుంచి పూత తయారీ, దుకాణాలకు చేరే వరకు జరుగుతున్న వ్యవహారంపై వివరాలు వెల్లడించారు. వెండి పూతగా ప్రచారం చేస్తూ అల్యూమినియం వినియోగించడం ప్రజలను తప్పుదోవ పట్టించే అంశమని స్పష్టం చేశారు. అల్యూమినియం కోటింగ్ ఉన్న స్వీట్లను తినడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని సీపీ హెచ్చరించారు. ముఖ్యంగా కిడ్నీలు, కాలేయంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల స్వీట్లు కొనుగోలు చేసేటప్పుడు వాటిపై ఉండే పూత విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పండుగలు, శుభకార్యాలు, ఇతర సందర్భాల్లో స్వీట్ల కొనుగోళ్లు చేసే ప్రజలు నాణ్యతపై దృష్టి పెట్టాలని మహేష్ భగవత్ కోరారు. వెండి పూత పేరుతో అల్యూమినియం వినియోగిస్తున్న వ్యవహారంపై ఆయన చేసిన హెచ్చరిక నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

మావోయిస్టుల స్థావరాల నుంచి 280 బారెల్ గ్రెనేడ్ లాంచర్ గుండ్లు స్వాధీనం

- తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో తనిఖీలు

కొత్తగూడెం, నవంబర్ 17 (శ్రీకర ఉదయం):



తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాచిన 280 బారెల్ గ్రెనేడ్ లాంచర్ (బీజీఎల్) గుండ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నవంబర్ 16న నిర్వహించిన గాలింపు చర్యల్లో ఈ పేలుడు సామగ్రి బయటపడింది. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసు సిబ్బంది, ప్రత్యేక పార్టీ సభ్యులు, బాంబు నిర్వీర్య బృందం సంయుక్తంగా అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గాలింపు సమయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్‌కు చెందిన మూడు రహస్య స్థావరాలను గుర్తించారు. సింటెక్స్ నీటి ట్యాంకుల డ్రములో బీజీఎల్ గుండ్లను దాచి ఉంచినట్లు పోలీసులు వెల్లడించారు. ఆయా డంపుల్లో ఉన్న సామగ్రిని బయటకు తీసి లెక్కించగా మొత్తం 280 గుండ్లు ఉన్నట్లు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి పీఎల్‌జీఏ బెటాలియన్‌కు చెందిన మొదటి కంపెనీదిగా పోలీసులు పేర్కొన్నారు. 2025 ప్రారంభంలో వీటిని అటవీ ప్రాంతంలోని రహస్య ప్రదేశాల్లో దాచినట్లు ప్రాథమికంగా వెల్లడించారు. భవిష్యత్తులో కార్యకలాపాలు తిరిగి ప్రారంభించినప్పుడు వినియోగించుకునే ఉద్దేశంతో దట్టమైన అడవుల్లో వీటిని భద్రపరిచినట్లు పోలీసుల ప్రకటనలో పేర్కొన్నారు. మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసేందుకు తెలంగాణ ప్రభుత్వం పునరావాస విధానాన్ని అమలు చేస్తోందని పోలీసులు తెలిపారు. 2025 చివరి భాగంలో, 2026 ప్రారంభంలో పలువురు మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు వెల్లడించారు. లొంగిపోయిన వారికి ప్రకటించిన ప్రోత్సాహక నగదును వెంటనే అందించడంతో పాటు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూమికి సహాయం, స్వయం ఉపాధి కోసం బ్యాంకు రుణాలు కల్పిస్తున్నట్లు వివరించారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఆరోగ్య రక్షణ పథకం కింద ఆరోగ్య కార్డులు కూడా అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వారు సాధారణ జీవితం గడిపేందుకు అవసరమైన సహాయాన్ని మానవీయ దృక్పథంతో అందిస్తున్నామని పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు హింసాత్మక మార్గాన్ని వీడి పోలీసుల ఎదుట లొంగిపోవాలని, ప్రధాన స్రవంతిలో చేరి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని భద్రాద్రి కొత్తగూడెం పోలీసులు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల్లో విజ్ఞానం, సృజనాత్మకత, దేశభక్తి పెంపొందించాలి : డా,, పెండెం కృష్ణ కుమార్

సూర్యాపేట నవంబర్ 17 (శ్రీకర ఉదయం):





నాలుగు సార్లు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన ప్రముఖ కళాకారుడు, రచయిత, పర్యావరణవేత్త, సామాజిక సేవకుడు డా. పెండెం కృష్ణ కుమార్ సూర్యాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)కు తన స్వంత నిధులతో జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖుల చిత్రపటాలు, సరస్వతీ దేవి, స్వామి వివేకానంద, బాబు రాజేంద్రప్రసాద్, జవహర్లాల్ నెహ్రు, ఆజాద్ చంద్రశేఖర్, మహాత్మ జ్యోతిరావు పూలే, సరోజినీ నాయుడు, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఏ పేజీ అబ్దుల్ కలాం, సుభాష్ చంద్రబోస్ వంటి చిత్రపటాలు , మెడికల్ కిట్, పెద్ద గోడ గడియారం, భారతదేశం, తెలంగాణ, ప్రపంచ పటాలు, పర్యావరణ పరిరక్షణ కోసం క్లాత్ బ్యాగులను అందజేశారు.ఈ సందర్భంగా డా. పెండెం కృష్ణ కుమార్ మాట్లాడుతూ.విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలంటే స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకులు, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు, వారి సేవలు, విజయాల గురించి తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. చదువుతో పాటు క్రీడలు, ఆరోగ్యం, సామాజిక బాధ్యతలకు కూడా విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఇష్టంతో విజ్ఞానాన్ని అభ్యసించి, ఉన్నత స్థానాలకు ఎదిగి, దేశ భవిష్యత్తులో భాగస్వాములై ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించి చేతి సంచులను ఉపయోగించాలని, నీటిని పొదుపుగా వాడాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి గోలి పద్మ మాట్లాడుతూ.నాలుగు సార్లు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన డా. పెండెం కృష్ణ కుమార్ తమ పాఠశాలను సందర్శించి విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు పాఠశాలకు అవసరమైన సామగ్రిని తన స్వంత నిధులతో అందించడం ఎంతో సంతోషకరమన్నారు. గత 34 సంవత్సరాలుగా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారితో సుమారు 40 నిమిషాల పాటు ప్రత్యేక సమావేశం పొందిన విశిష్ట వ్యక్తి తమ పాఠశాలకు వచ్చి విద్యార్థులకు ఉపయోగపడే సామగ్రిని అందించడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కృష్ణ కుమార్ గారు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పురస్కారాలు పొందాలని, దేశ సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి గోలి పద్మతో పాటు ఉపాధ్యాయులు బట్టు సునీత, ఆలేటి సుమతి, కోణం అరుణ భారతి, దేవులపల్లి మంజుల, అరుణకుమారి, కోన వెంకటేశ్వర్లు, కర్నాటి శ్రీనివాస్, కే. పుష్పలీల, జి. మధుసూదన్ రెడ్డి, శ్రీరంగం ఉమ, బి. రమణకుమారి, కడారి నిర్మల, అబ్దుల్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలి: ఎస్పీ కె నరసింహ

సూర్యాపేట నవంబర్ 17 (శ్రీకర ఉదయం):



ప్రజల రక్షణ, సురక్షిత ప్రయాణం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ లక్ష్యంగా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు.మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన ఖమ్మం అండర్‌పాస్ వద్ద నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల తనిఖీల నిర్వహణ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకుంటున్న చర్యలను పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.పట్టణంలోని ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో వాహనదారులు, పాదచారులు సులభంగా ప్రయాణించేలా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. రోడ్లపై అక్రమ ఆక్రమణలను తొలగిస్తూ ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే పరిస్థితులను నియంత్రిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహనాల తనిఖీల సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రోడ్లను ఆక్రమించిన వారికి ముందుగా అవగాహన కల్పించి, రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రజలకు, వ్యాపార నిర్వాహకులకు ఎస్పీ విజ్ఞప్తి: పట్టణంలోని దుకాణదారులు, వ్యాపార సంస్థల నిర్వాహకులు తమ వ్యాపార కార్యకలాపాల కోసం రోడ్లను ఆక్రమించవద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. రహదారులపై వాహనాలు నిలపడం, వస్తువులు ఏర్పాటు చేయడం ద్వారా ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు సహకరించాలని కోరారు. ప్రజల భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణం, పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా నిరంతరం చర్యలు కొనసాగిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి, ఎస్ఐలు గోపి, కృష్ణ, కనకరత్నం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం, మార్కెట్ అభివృద్ధే ధ్యేయం: కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట నవంబర్ 17 (శ్రీకర ఉదయం):



సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన అగ్రికల్చరల్ ఆడ్తి అసోసియేషన్ ముఖ్య సమావేశంలో మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి వ్యవసాయ మార్కెట్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. మార్కెట్‌లో వ్యాపారులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మార్కెట్ నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైతులకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు.రైతులు, వ్యాపారులు, హమాలీలు, మార్కెట్‌పై ఆధారపడిన ప్రతి ఒక్కరికీ అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి, రైతులు మరియు మార్కెట్ వర్గాల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ సమావేశంలో మార్కెట్ కార్యదర్శి యండి ఫసియోదీన్ ముక్రం, అసిస్టెంట్ కార్యదర్శి వెంకట్ రెడ్డి, గ్రేటు2 కార్యదర్శి ఉమ మహేశ్వర్, ఖాసీం, ఆడ్తి అసోసియేషన్ సభ్యులు, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏబివిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

సూర్యాపేట నవంబర్ 17 (శ్రీకర ఉదయం):



అఖిల భారతీయ అయ్యప్ప ధర్మాప్రచార సభ, ఆవిర్భావ దినోత్సవం ను పురస్కరించుకొని జాతీయ అధ్యక్షులు అయ్యప్ప దాస్ పిలుపు మేరకు అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద ఏ బి ఏ పి సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘం జెండాను ఆవిష్కరణ చేశారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగు ముత్యంరాజు రాష్ట్ర కమిటీ సభ్యులు భూపతి శ్రీనివాస్ స్వామి లు మాట్లాడుతూ అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయస్థాయిలో వలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. నవంబర్ 16వ తేదీ నుండి జనవరి 18 వరకు ధర్మ ప్రచార సభ ద్వారా శబరిమలకు దగ్గరలో నారాయణతోడు ప్రాంతంలో నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వఇస్తున్నామన్నారు. ఏ బి ఏ పి సొంత భవనం నిర్మించుకొని అందులో నే అన్నదానం శబరిమల నూతన మెల్ శాంతులతో ప్రారంబొత్సవం చేసుకోవడం జరిగిందని సూర్యాపేట లోని అయ్యప్ప స్వామిభక్తులు అన్నదాన కార్యక్రమం నకు, భవన నిర్మాణం నకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పి ఆర్ ఓ చౌదరి రెడ్డి , సభ్యులు, మట్టపల్లి రాధాకృష్ణ,సిద్దప్ప, గుణగంటి శ్రీనివాస్, మాలి లింగారెడ్డి, గుండేటి లక్ష్మణ్ నిమ్మల శ్రీనివాస్, సందీప్ స్వామి,ముంతా శ్రీను, , ఏ రాంబాబు, నిమ్మగడ్డ జనార్దన్, అరవింద్, ఫణిందర్, రాచకొండ కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖలో ఇక నిర్లక్ష్యానికి తావులేదు!

పీహెచ్‌సిల పనితీరుపై రోజువారీ సమీక్ష..

సూర్యాపేట కలెక్టరేట్ నవంబర్ 17 (శ్రీకర ఉదయం):



ఆరోగ్యశాఖలో పనితీరు మెరుగుపర్చేందుకు అధికారులు సమష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. ఇకపై వ్యక్తులపై ఆధారపడకుండా వ్యవస్థాగత మార్పులతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ శాఖలో ప్రతి అధికారి తన బాధ్యతలను గుర్తించి, ప్రాధాన్యతా అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నవంబర్ 30 వరకు ప్రతిరోజూ పీహెచ్‌సి లతో పది నిమిషాల పాటు సమీక్ష నిర్వహిస్తానని ప్రకటించారు. ప్రతి అధికారి తన పరిధిలోని కార్యక్రమాలు, బాధ్యతలు, పర్యవేక్షించాల్సిన అంశాలను జాబితా చేసుకోవాలని సూచించారు. వాటిలో అత్యంత కీలకమైన ఐదు అంశాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయాలన్నారు. మొత్తం పనుల్లో 80 శాతం పురోగతి సాధించేందుకు ఈ ఐదు అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. పెండింగ్ పనులు, అత్యవసర అంశాలు, పూర్తి చేసిన కార్యక్రమాల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. నవంబర్ 30 వరకు ప్రతిరోజూ పీహెచ్‌సిల వారీగా సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి అధికారి తన పనుల పురోగతిని ఒక పేజీలో రాసుకొని సమావేశానికి రావాలని ఆదేశించారు. ఏ పని పూర్తయింది? ఏది పెండింగ్‌లో ఉంది? ఎంత శాతం పురోగతి సాధించారు? అనే వివరాలు స్పష్టంగా తెలియజేయాలన్నారు సమీక్షకు హాజరుకాకపోవడాన్ని సహించేది లేదని తేల్చిచెప్పారు.

ఫైళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫైళ్ల సర్క్యులేషన్, అడ్మినిస్ట్రేటివ్ ప్రొసీజర్స్ పక్కాగా ఉండాలని ఆదేశించారు. ఫైళ్లు నిబంధనల ప్రకారం సక్రమంగా రావాలని, ఆఫీస్ ప్రొసీజర్స్, క్యాడర్ మేనేజ్‌మెంట్‌లో లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. పాత కారణాలు చెబుతూ పనులు ఆలస్యం చేయడాన్ని ఇకపై అంగీకరించబోమన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇమ్యూనైజేషన్, లేబర్ రూముల ఆధునీకరణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రుల వైపు మళ్లించేలా సేవల్లో గణనీయమైన మార్పు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వెక్టర్ బార్న్ వ్యాధుల నియంత్రణ వంటి అంశాల్లో ఆరోగ్యశాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమస్య ఏ స్థాయిలో ఉంటే అదే స్థాయిలో పరిష్కరించుకోవాలని, ప్రతి చిన్న విషయాన్ని జిల్లా కలెక్టర్ లేదా డీఎంహెచ్‌వో స్థాయికి తీసుకురావడం సరైన విధానం కాదన్నారు. ఆఫీసులో ఉన్నంతసేపు ఇతర విషయాలు పక్కనపెట్టి విధులపైనే దృష్టి పెట్టాలని హెచ్చరించారు. సానుకూల దృక్పథంతో పనిచేస్తూ ఆరోగ్యశాఖలో మార్పుకు అధికారులు ముందుండాలన్నారు. పనితీరు మెరుగుపర్చుకోని వారిని మారుమూల ప్రాంతాలకు, అవసరమైతే శాఖ వెలుపలికి పంపించే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. పాత విషయాలను తవ్వకుండా, నేటి నుంచి పద్ధతి ప్రకారం పనిచేయాలని అధికారులకు సూచించారు.కార్యక్రమం లో డి ఎం అండ్ హెచ్ ఓ కోటిరత్నం డివ్యూటీ డిఎంహెచ్వో చంద్రశేఖర్ మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల సర్పంచుల ఫోరం

నూతన కమిటీకి అభినందనలు తెలిపిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

సూర్యాపేట నవంబర్ 17 (శ్రీకర ఉదయం):



సూర్యాపేట పట్టణంలోని వైట్ హౌస్‌లో నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తూముల భుజంగరావు ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మండల సర్పంచుల ఫోరం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేస్తూ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుంటూ, గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నూతన బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరికీ మంచి విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు(గాజులమల్కాపురం) సర్పంచ్ నాతాల వెంకటరెడ్డిప్రధాన కార్యదర్శిఇటుకల శ్రీనుఉపాధ్యక్షులు ముత్తినేని శ్రీను, భూక్య జామా నాయక్, ఒగ్గు రవి కార్యదర్శిపొనుగంటి నరేందర్ నాయుడుకోశాధికారి ధారావత్ కవిత రవీందర్ నాయక్ లు ఉన్నారు. వీరి వెంట లింగాల సర్పంచ్ గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డి, గూడెపుకుంట లచ్చి రామ్ నాయక్, ధూపహాడ్ నన్నెపంగా కమలమ్మ, మహమ్మదాపురం కొండేటి మౌనిక పవన్, సింగారెడ్డిపాలెం ఒగ్గు కిరణ్, చిన్న గారెకుంట వసంత శ్రీనివాస్, చిన్న సీతారాం తండా చందూలాల్, పొట్లపహాడ్ మేకపోతుల లింగయ్య, మొరసకుంట హుస్సేన్, అనాజిపురం అనుములపూరి నాగయ్య, తంగేళ్లగూడెం వెంకటేశ్వర్లు, అనంతారం శోభ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకర ఉదయం
PRGI : TGTEL/26/A0689
తెలుగు దినపత్రిక
నిజమే మా నినాదం...

సినిమా సిత్రం

‘ఐ హేట్ మ్యారేజ్’

యూత్‌కు కనెక్ట్ అయ్యేలా..



ట్రైలర్ విడుదల!సుగి విజయ్, జుప్సీ భద్ర (తొలి పరిచయం) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ‘ఐ హేట్ మ్యారేజ్’ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. ట్రైలర్‌ను చూస్తుంటే నేటి తరం యువతకు నచ్చే అంశాలతో పాటు ప్రతి యువత ఈ సినిమాకు కనెక్ట్ అయ్యే విధంగా కనిపిస్తుంది. యూత్‌కు కనెక్ట్ అయ్యేలా.. ‘ఐ హేట్ మ్యారేజ్’ ట్రైలర్ విడుదల! సుగి విజయ్, జుప్సీ భద్ర (తొలి పరిచయం) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం ‘ఐ హేట్ మ్యారేజ్’స. పరమేష్ రేణు కుంట్ల దర్శకుడు. ఆర్య సినిమా పతాకంపై మాదం దయానంద్, కార్తీక్ వెంపటి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రానికి ప్రముఖ ఛాయాగ్రాహకుడు ఎఅయిఎ జ ఖబఎఖతీ డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీని అందించారు. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటి వరకు ఈ మూవీ నుంచి వచ్చిన ప్రతి కంటెంట్ మంచి ఆదరణ అందుకుంది. కాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. ట్రైలర్‌ను చూస్తుంటే నేటి తరం యువతకు నచ్చే అంశాలతో పాటు ప్రతి యువత ఈ సినిమాకు కనెక్ట్ అయ్యే విధంగా కనిపిస్తుంది ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. ప్రేమ, పెళ్లి, కెరీర్‌తోపాటు స్వతంత్రంగా జీవించాలనే నేటి +వఅ్గ తరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నం ఈ చిత్రంలో చేశాను. ప్రతి సన్నివేశం ఎంతో సహజంగా ఉంటుంది. ఇందులోని భావోద్వేగాలు ఆడియన్స్‌ను కట్టిపడేస్తాయి. ఎలాంటి సినిమాటిక్ అతిశయోక్తులు లేకుండా, నిజ జీవితంలో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఈ చిత్రంలో కనిపించనుంది. కొత్త తరహా సినిమాలను ఆదరించే తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రం తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది’ అన్నారు. ఈ చిత్రంలో హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటించారు. పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి,ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్ తదితరులు నటిస్తున్న ఈ మూవీలో బేబి తమోష్ణ, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ప్రముఖ నటి ఇందు, అఖండ సుధాకర్ రెడ్డి తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి వరికుప్పుల యాదగిరి సంగీతం అందిస్తున్నారు.


క్రీడా విభాగం :

సెలక్టర్ జహా బైట్‌తా హై, వహి మార్నా హై..



ఎంఎస్ ధోనీ ఫిల్మ్ ప్రేరణతో రాణిస్తున్న సూర్య సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ముంబై కెప్టెన్ సూర్యకుమార్ దుమ్మురేపుతున్నాడు. వరుసగా రెండు మ్యాచుల్లో రెండు హాఫ్ సెంచరీలు కొట్టాడు. తన సక్సెస్ గురించి చెబుతూ ఎంఎస్ ధోనీ ఫిల్మ్ డైలాగ్‌ను గుర్తు చేశాడు.సెలక్టర్ జహా బైట్‌తా హై, వహి మార్నా హై.. ఎంఎస్ ధోనీ ఫిల్మ్ ప్రేరణతో రాణిస్తున్న సూర్య న్యూఢిల్లీ: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ముంబై కెప్టెన్ సూర్యకుమాందుమ్మురేపుతున్నాడు. వరుసగా రెండు మ్యాచుల్లో రెండు హాఫ్ సెంచరీలు కొట్టాడు. ధనాధన్ బ్యాటింగ్‌తో మళ్లీ కేక పుట్టిస్తున్నాడు. ఇటీవల టీ20 వరల్డ్‌కప్ గెలిచిన టీమిండియా జట్టుకు కెప్టెన్‌గా ఉన్న సూర్యకుమార్ ఆ తర్వాత ఫామ్ కోల్పోవడంతో జట్టు నుంచి తప్పించారు. అయితే తాజా ముస్తాక్ అలీ టోర్నీతో అతను మళ్లీ ఫామ్‌లోకి వచ్చేశాడు. హైదరాబాద్‌తో మ్యాచ్‌లో అతను 21 బంతుల్లో 60 రన్స్ చేశాడు, ఆ తర్వాత గుజరాత్‌పై 29 బంతుల్లో 82 పరుగులు చేశాడు. సెలెక్టర్ల దృష్టిలో పడేందుకు సూర్య తన డాషింగ్ బ్యాటింగ్ స్టయిల్‌ను ప్రదర్శిస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌తో మ్యాచ్ ముగిసిన తర్వాత సూర్య మీడియాతో మాట్లాడాడు. పరుగులు రాబట్టడం, ముంబైని గెలిపించడంపైనే ఫోకస్ పెట్టినట్లు చెప్పాడు. ఇక భారత మాజీ కెప్టెన్ ధోనీ జీవితకథ ఆధారంగా తీసిన ఎంఎస్ ధోనీ ద అన్‌టోల్డ్ స్టోరీ ఫిల్మ్‌లో ఉన్న ఓ డైలాగ్‌ను కూడా అతను గుర్తు చేశాడు. తన మైండ్‌సెట్ గురించి చెబుతూ ఆ ఫిల్మ్ డైలాగ్‌ను సూర్య వివరించాడు. ఆ సినిమాలో మహేంద్ర సింగ్ ధోనీతో అతని స్నేహితుడూ మాట్లాడుతూ.. సెలెక్టర్లు ఎక్కడ కూర్చుంటారో, అక్కడికే బంతిని కొట్టాలన్న డైలాగ్ వినిపిస్తాడు. అయితే ఆ ప్లాన్‌తోనే ఇవాళ తాను ఆడినట్లు సూర్య చమత్కరించాడు. వీలైనంత నిలకడగా పరుగులు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పాడు. ఇక ఈస్ట్ జోన్ బీసీసీఐ సెలెక్టర్ శివసుందర్ దాస్ ఆ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. హైదరాబాదీ బౌలర్లను సూర్య అటాక్ చేస్తున్న సమయంలో కొందరు ఐపీఎల్ ప్లేయర్లు కూడా ఆ మ్యాచ్‌ను తిలకించారు. సాల్ట్‌లేక్‌లో ఉన్న జాదవ్‌పూర్ వర్సిటీ గ్రౌండ్ బయట ఓ సిక్సర్ పడింది. టీ20 గేమ్ అనేది ఎంటర్‌టైన్మెంట్ ఫార్మాట్ అని, చాలా స్వేచ్ఛగా ఆడాలని సూర్య పేర్కొన్నాడు. సెలెక్టర్లకు మెసేజ్ ఇవ్వడం తన ఉద్దేశం కాదు అని, బ్యాటింగ్‌ను ఎంజాయ్ చేస్తున్నట్లు చెప్పాడు. ప్రాక్టీస్‌లో కొట్టిన షాట్లనే.. మైదానంలో ఆడుతున్నానని, అంటే తన ప్రాక్టీస్ సక్సెస్ అయినట్లే అని సూర్య తెలిపాడు.


గంటకు వేలల్లో టికెట్ల విక్రయం..



రికార్డులు బద్దలు కొడుతున్న ‘అవెంజర్స్: డూమ్స్‌డే’ మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ ‘అవెంజర్స్: డూమ్స్‌డే’ సినిమా కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు మార్వెల్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. గంటకు వేలల్లో టికెట్ల విక్రయం.. రికార్డులు బద్దలు కొడుతున్న ‘అవెంజర్స్: డూమ్స్‌డే’

మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ ‘అవెంజర్స్: డూమ్స్‌డే’ సినిమా కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు మార్వెల్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజులు మాత్రమే సమయం ఉండటంతో, మేకర్స్ ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ ప్రక్రియను ప్రారంభించి బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తున్నారు. అమెరికా కంటే ఒక రోజు ముందే మన దేశంలో ఈ చిత్రం విడుదలవుతుండటం విశేషం. భారతదేశంలో ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని డిసెంబర్ 17న అత్యంత వైభవంగా గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేయనున్నారు. అగ్రరాజ్యం అమెరికాతో పాటు ఇతర పాశ్చాత్య దేశాల కంటే మన దేశంలోనే ఈ సినిమా ఒకరోజు ముందుగా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఇండియన్ మార్వెల్ ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్ అయిన బుక్‌మైషో మరియు డిస్ట్రిక్ట్) యాప్‌లలో అడ్వాన్స్ బుకింగ్స్ అధికారికంగా ఓపెన్ అయ్యాయి. బుకింగ్స్ ప్రారంభమైన క్షణం నుంచే టికెట్ల విక్రయాలు ఊహించని రీతిలో జరుగుతున్నాయి. బుక్‌మైషోలో సగటున గంటకు ఏకంగా 9 వేల టికెట్లు అమ్ముడవుతూ సరికొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా మెట్రో నగరాల్లో వీకెండ్ షోల టికెట్లు నిమిషాల వ్యవధిలోనే హాట్ కేకుల్లా అమ్ముడైపోతున్నాయి. ఈ సినిమాను సాధారణ స్క్రీన్లపై కాకుండా ఐమ్యాక్స్, 4ణశ, ఇన్ఫినిటీ విజన్అ) వంటి అత్యాధునిక ప్రీమియం ఫార్మాట్లలో తిలకించేందుకు ఆడియన్స్ విపరీతమైన ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ప్రీమియం ఫార్మాట్ టికెట్లకు డిమాండ్ తారస్థాయికి చేరింది. దేశంలోని కొన్ని ప్రధాన నగరాల్లో ఇన్ఫినిటీ విజన్ మరియు ఐమ్యాక్స్ టికెట్ల ధరలు రూ. 2 వేల వరకు పలుకుతున్నప్పటికీ, ఫ్యాన్స్ మాత్రం వెనుకాడకుండా టికెట్లను బుక్ చేసుకుంటున్నారు.

విజ్ఞాన్స్’లో విశాట్ నోటిఫికేషన్ విడుదల



యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం, పరిశోధనలకు పెద్దపీట వేయడంలాంటి సమున్నత లక్ష్యాలతో తాము ముందుకెళ్తున్నామని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ కృష్ణకిశోర్ తెలిపారు. ‘విజ్ఞాన్స్’లో విశాట్ నోటిఫికేషన్ విడుదల హైదరాబాద్, నవంబర్ 16: (నమస్తే తెలంగాణ) : యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం, పరిశోధనలకు పెద్దపీట వేయడంలాంటి సమున్నత లక్ష్యాలతో తాము ముందుకెళ్తున్నామని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ కృష్ణకిశోర్ తెలిపారు. 2027-28 విద్యాసంవత్సరానికి సంబంధించి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్బీ(హానర్స్), బీబీఏ ఎల్ఎల్బీ(హానర్స్), బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చర్, ఫార్మ్ డీ అడ్మిషన్ల వీశాట్ నోటిఫికేషన్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీటెక్‌లో అగ్రికల్చర్, బయో టెక్నాలజీ, బయో ఇన్‌ఫర్మాటిక్స్, బయో మెడికల్, కెమికల్, సివిల్, సీఎస్ఈతోపాటు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, డాటా సైన్స్, ఐవోటీ, ఈసీఈ, ఈసీఈ-వీఎల్ఎస్ఐ, ఈఈఈ, ఫుడ్ టెక్నాలజీ, ఐటీ మెకానికల్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, టెక్స్‌టైల్ టెక్నాలజీ, బీ ఫార్మసీ, ఫార్మా-డీ, ఎం ఫార్మసీ, బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చర్, డిప్లొమా(సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్, ఈఈఈ) కోర్సులు అందజేస్తున్నామని తెలిపారు. వీటితోపాటు ఐటెప్ బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీఎస్సీ(సైకాలజీ), బీఎస్సీ(డాటా సైన్స్), బీఎస్సీ(మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్స్), బీఎస్సీ(ఆక్చూరియల్ సైన్స్), బీబీఏ, బీసీఏ, బీఏ(ఎల్ఎల్బీ), బీబీఏ (ఎల్ఎల్బీ), ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లిష్, ఎమ్మెస్సీ డాటా సైన్స్, ఎమ్మెస్సీ సైకాలజీ, పీహెచ్‌డీ కోర్సులు అందజేస్తున్నామని పేర్కొన్నారు.

EDITOR, PRINTED, PUBLISHED AND OWNED BY :MUSHAM HARIPRASAD, 1`4`249/101/1/2/1, BALAJI NAGAR, NEAR MADEENA MASJID, SURYAPET, TELANGANA ` 508213 .PRINTED AT : BSH ASSOCIATES,
H.NO: 37/1/418, RAMANAGAR 3RD LINE, OPP RIMS HOSPITAL,ONGOLE, PRAKASAM, ANDHRA PRADESH ` 523001. EDITOR : MUSHAM HARIPRASAD, TGTEL/26/A0689 Email : mushamhari17@ gmail.com, Cell : 9885133078